క్లుప్తంగా

నేడు శాంతి ర్యాలీ

రాజంపేట టౌన్: సరస్వతి పిరమిడ్ రాజంపేట శాఖ ఆరవ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని ఆదివారం ఉదయం 9 గంటల నుంచి పట్టణంలో మహాకరుణ శాఖాహార ర్యాలీని నిర్వహించనున్నట్లు పిరమిడ్ స్పిరుచువల్ సొసైటీ ప్రతినిధులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ర్యాలీ అనంతరం ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద ఉన్న సరస్వతి పిరమిడ్ ధ్యాన మందిరంలో సంత్‌సదానందగిరి స్వామి మహరాజ్ ఆధ్యాత్మికోపన్యాసం ఇస్తారని తెలిపారు. ఈ కార్యక్రమాల్లో ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని వారు కోరారు.

రేపు ప్రజా దర్బార్

రామాపురం: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో సోమవారం రాష్ట్ర రవాణా, యువజన, క్రీడల శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి ఆదేశాల మేరకు ప్రజా దర్బార్‌ను నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ జాషువా శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి మంత్రి రాంప్రసాద్‌రెడ్డి హాజరవుతారని పేర్కొన్నారు. మండల స్థాయిలోని అన్ని శాఖల అధికారులు హాజరు కావాలని కోరారు. సమస్యల పరిష్కారం నిర్వహిస్తున్న ఈ కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన



ప్రకృతి వ్యవసాయంపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ప్రవీణ్‌కుమార్

రామాపురం: మండల కేంద్రంలోని ఏపీ మోడల్ స్కూల్‌లో విద్యార్థులకు శనివారం ప్రకృతి వ్యవసాయంపై ప్రకృతి వ్యవసాయ జిల్లా ప్రాజెక్టు ఇన్‌చార్జి మేనేజర్ ఎస్.వి.ప్రవీణ్‌కుమార్ అవగాహన కల్పించారు.
విద్యార్థులకు ప్రకృతి వ్యవసాయం ప్రధాన్యత, ఆహారం, ఆరోగ్యం, పోషక విలువలు గురించి తెలియజేశారు. విద్యార్థులతో ప్రత్యేకంగా కిచెన్ గార్డెన్, న్యూట్రీ గార్డెన్ నమూనా వేయించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

సర్పంచ్ నాగా పిచ్చిరెడ్డి మృతి

పుల్లంపేట: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, కోనెయ్యగారిపల్లి సర్పంచ్ నాగా పిచ్చిరెడ్డి (60) అనారోగ్యంతో మృతి చెందారు. కొంతకాలంగా ఆయన అనారోగ్యంతో బాధపడుతూ శనివారం తుదిశ్వాస విడిచారు. సోమవారం కోనెయ్యగారిపల్లి గ్రామంలో అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మృతుని కుటుంబానికి పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు సానుభూతి తెలిపారు.

ప్రభుత్వ భూములు పేదలకు ఇవ్వాలి



నిరసన తెలుపుతున్న బీకేఎంయూ నాయకులు

రైల్వేకోడూరు అర్బన్: ప్రభుత్వ బంజరు భూములను అర్హులైన పేదలకు ఇవ్వాలని శనివారం బీకేఎంయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆవుల శేఖర్ డిమాండ్ చేశారు. పట్టణంలో జరిగిన బీకేఎంయూ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం రాష్ట్రంలోని ప్రభుత్వ బంజరు భూములను అర్హులకు ఇచ్చి వాటిని వ్యవసాయ యోగ్యంగా తయారు చేసుకోవడానికి సహకరించాలని కోరారు. జనవరిలో జిల్లా భూ పోరాట సదస్సు కోడూరులో నిర్వహిస్తామని తెలిపారు. అనంతరం కోడూరు బీకేఎంయూ కార్యవర్గాన్ని ఎన్నుకొన్నారు. ఈ కార్యక్రమంలో పండుగోలు మణి, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

మత సామరస్యం వెల్లివిరియాలి



అంబేడ్కర్ చిత్రపటం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న పలుసంఘాల నాయకులు

రాయచోటి అర్బన్: దేశంలో మత సామరస్యం వెల్లివిరియాలని పలు సంఘాల నేతలు ఆకాంక్షించారు. శనివారం తహసీల్దార్ కార్యాలయం వద్ద ఉన్న అంబేడ్కర్ చిత్రపటం వద్ద భారత రాజ్యాంగ పరిరక్షణ వేదిక ఆధ్వర్యంలో పలు సంఘాల నేతలు మతోన్మాదానికి వ్యతిరేకంగా నిరసన ప్రదర్శన చేశారు. సీపీఎం జిల్లా కార్యదర్శి పి.శ్రీనివాసులు మాట్లాడుతూ భారత దేశం భిన్నత్వంలో ఏకత్వానికి నిదర్శనమన్నారు. మతోన్మాద చర్యలకు పాల్పడితే వారిని కఠినంగా శిక్షించాలని కోరారు. గురు, శుక్రవారాల్లో రెండు వర్గాల మధ్య జరిగిన ఘటన దురదృష్టకరమన్నారు. మతం వ్యక్తిగతం అని, అన్ని మతాలకన్నా మానవత్వం గొప్పదని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకుడు రామాంజనేయులు, భారతీయ అంబేడ్కర్‌సేన రాష్ట్ర కార్యదర్శి పల్లం తాతయ్య, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి రామాంజులు, కేవీపీఎస్ జిల్లా కో కన్వీనర్ వెంకటయ్య, ప్రజాసంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

వలంటీర్ల ఆశలు ఆవిరి!

- మాట తప్పిన చంద్రబాబు
- అధికారంలోకి వచ్చాక మోసగించిన కూటమి ప్రభుత్వం

రాయచోటి (జగదాంబసెంటర్): వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ప్రతి నెలా ఒకటో తేదీన పొద్దుపొడవక ముందే సామాజిక పెన్షన్లు అందేవి. సంక్షేమ ఫలాలు లబ్ధిదారుల గడప వద్దకే వచ్చేవి. ఇలా ప్రభుత్వ అమలు చేసే పథకాలు నేరుగా అర్హులకు అందేవి. ఇందంతా వలంటీర్ల గొప్పతనమే. ప్రభుత్వానికి ప్రజలకు వారధిగా వ్యవహరిస్తూ అందరి ప్రశంసలు పొందారు. కోవిడ్ సమయంలో సొంతవాళ్లే పట్టించుకోని పరిస్థితుల్లో తామున్నామంటూ వలంటీర్లు సేవలందించారు. అయితే వలంటీర్లపై కూటమి ప్రభుత్వం కక్ష పూరితంగా వ్యవహరిస్తోంది. ఎన్నికల ప్రచారంలో చంద్రబాబు వలంటీర్లపై ప్రేమ వలకపోశారు. మీ సేవలకు రూ.5 వేలు ఏ మాత్రం సరిపోతుందని, తమ ప్రభుత్వం అధికారంలోకి రాగానే రూ.10 వేల గౌరవవేతనం ఇస్తామని ఆయన నమ్మపలికారు. బాబుతో పాటు కూటమి పెద్దలు హామీలు గుప్పించడంతో వలంటీర్లు ఆశపడ్డారు. అధికారంలోకి



వృద్ధుడికి పెన్షన్ అందజేస్తున్న వలంటీర్ (ఫైల్)

వచ్చిన తర్వాత కూటమి ప్రభుత్వం మాట తప్పింది. అసెంబ్లీ సాక్షిగా వలంటీర్ల వ్యవస్థ లేదు కాదా.. అని కూటమి ప్రభుత్వ ప్రతినిధులు మాట్లాడిన తీరు అందరినీ విస్మయానికి గురిచేసింది. దీంతో చంద్రబాబుపై వలంటీర్లు పెట్టుకున్న ఆశలు ఆవిరయ్యాయి. చంద్రబాబు తమకు రూ.10 వేలు చెల్లిస్తారని ఎదురుచూసిన వారికి నిరాశే మిగిలింది.

కూటమి ప్రభుత్వంపై విమర్శలు

ప్రజలకు నేరుగా సేవలు అందించేందుకు మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి వలంటీర్ వ్యవస్థను తీసుకువచ్చారు. ఒక్కో వలంటీర్‌కు యాభై కుటుంబాలు కేటాయించడం జరిగింది. ఇంటి వద్దకే పెన్షన్‌తో పాటు ఆరోగ్యం, వివిధ దరఖాస్తులకు సంబంధించి ఆయా కుటుంబసభ్యులుగా మెలిగారు. ప్రత్యేకించి కరోనా సమయంలో వలంటీర్ల సేవలను ఎవరూ మరిచిపోలేరు. కరోనా బాధితులకు కుటుంబసభ్యులు దూరంగా ఉన్నా వలంటీర్లు ప్రాణాలకు తెగించి సేవలు అందించారు. వీరి సేవలను ఇతర రాష్ట్రాల ప్రజా ప్రతినిధులు కూడా మెచ్చుకున్నారు. కూటమి ప్రభుత్వం వలంటీర్ల వ్యవస్థ లేదని చెప్పడంతో ప్రతి ఒక్కరూ ఆశ్చర్యానికి గురవుతున్నారు. గత ప్రభుత్వం వీరు సేవలను గుర్తుచేసుకుంటున్నారు. కూటమి ప్రభుత్వంపై విమర్శలు గుప్పిస్తున్నారు. ప్రభుత్వం వలంటీర్లకు న్యాయం చేయాలని ప్రజలు కోరుతున్నారు.

మోసం చేయడం తగదు



ఎన్నికలప్పుడు వలంటీర్లను కొనసాగిస్తామని సీఎం చంద్రబాబు మాట ఇచ్చి అధికారంలోకి వచ్చాక తప్పారు. ఎన్నికల్లో గెలవడానికి హామీలిచ్చి మోసం చేయడం తగదు. అధికారం ఉంటే ఒకలా.. అధికారం లేకపోతే మరోలా వ్యవహరించడంసరికాదు. – కె.వినోద్, వలంటీర్, గున్నికుంట్ల గ్రామం, సంబేపల్లె మండలం

హామీ నెరవేర్చాలి



ఎన్నికల సమయంలో కూటమి నేతలు ఇచ్చిన హామీని నెరవేర్చాలి. వాలంటీర్ల వ్యవస్థను కొనసాగిస్తామని, పారితోషికం రూ.10 వేలకు పెంచుతామని హామీ ఇచ్చారు. ప్రజలకు అన్ని రకాల సేవలు అందించిన వలంటీర్లను కూటమి ప్రభుత్వం విస్మరించడం తగదు. – ఎస్.మహబూబ్‌బాషా, వలంటీర్, రాయచోటి

వలంటీర్లను నియమించాలి



గత ప్రభుత్వంలో రేషన్‌కార్డులు, వివిధ ధ్రువీకరణ పత్రాలు ఏం కావాలన్నా వాలంటీర్లకు చెబితే వారే సచివాలయానికి వెళ్లి పనులు పూర్తి చేసేవారు. దీంతో వృద్ధులు, దివ్యాంగులకు కష్టాలు ఉండేవి కావు. కూటమి ప్రభుత్వం పునరాలోచించి మళ్లీ వాలంటీర్లను నియమించాలి. – ఎస్.శ్రావణి, వలంటీర్, రాయచోటి

మధ్యవర్తిత్వంతో సత్వర న్యాయం

రైల్వేకోడూరు అర్బన్: కేసుల సత్వర పరిష్కారానికి మధ్యవర్తిత్వాన్ని ప్రోత్సహించి కక్షిదారులకు సత్వర న్యాయం అందించవచ్చని స్పెషల్ ఫస్ట్‌క్లాస్ జడ్జి హేమ స్రవంతి జానకిరామ్ తెలిపారు. శనివారం స్థానిక బార్ అసోసియేషన్ కార్యాలయంలో న్యాయవాదులకు మధ్యవర్తిత్వంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మధ్యవర్తిత్వం ద్వారా విచ్ఛిన్నమైన మానవ సంబంధాలను మెరుగు పరచవచ్చని పేర్కొన్నారు. మధ్యవర్తిత్వాన్ని ఏ విధంగా అమలు జరపాలనే విషయాన్ని న్యాయవాదులు క్షుణ్ణంగా అవగాహన కల్పించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు పాల్గొన్నారు.

నందలూరు: మధ్యవర్తిత్వం ద్వారా కక్షిదారులకు సత్వర న్యాయం అందించవచ్చని మండల లీగల్ సర్వీసెస్ కమిటీ చైర్మన్ జె. నందిని పేర్కొన్నారు. స్థానిక జూనియర్ సివిల్ కోర్టులో నందలూరు బార్



మాట్లాడుతున్న జడ్జి హేమ ప్రశాంతి

అసోసియేషన్ న్యాయవాదులకు మధ్యవర్తిత్వం అనే అంశంపై సెన్సిటైజేషన్ ప్రోగ్రామ్‌ను శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మధ్యవర్తిత్వానికి సంబంధించి మెలకువలు నేర్చుకొని సత్వర న్యాయం అందించేందుకు కృషి చేయాలని న్యాయవాదులకు పిలుపునిచ్చారు. కోర్టుల్లో పేరుకుపోతున్న కేసుల పరిష్కారానికి మధ్యవర్తిత్వం దోహదపడుతుందన్నారు. న్యాయవాదులు ఏవీ సుబ్రమణ్యం, దాసరి నరసింహులు, షేక్ మహమ్మద్ అలీ పాల్గొన్నారు.

వైభవంగా సుబ్రహ్మణ్య షష్టి వేడుకలు

రాజంపేట టౌన్: రాజంపేట పట్టణం ఈడిగపాళెంలో వెలసిన వరసిద్ధి వినాయక స్వామి, బాలసుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో శనివారం సుబ్రహ్మణ్య షష్టి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివార్లను, ఉత్సవ విగ్రహాలను ప్రత్యేక పుష్పాలతో, పట్టు వస్త్రాలతో శోభాయమానంగా అలంకరించారు.

రామాపురం: మండలంలోని హసనాపురం పంచాయతీ పప్పిరెడ్డిగారిపల్లె సమీపంలోని శ్రీ గంగా భవానీ సమేత మూలస్థానేశ్వర స్వామి (శివాలయం హసనాపురం) ఆలయంలో శనివారం



ప్రత్యేక అలంకరణలో ఉత్సవ మూర్తులు

సుబ్రహ్మణ్య మూల మంత్రంతో సహస్ర ఆవృత్తుల హోమాన్ని ఘనంగా నిర్వహించారు.

తల్లిదండ్రులే పిల్లలకు మొదటి గురువులు



చిట్వేలి: బహుమతులు ప్రదానం చేస్తున్న సర్పంచ్ తదితరులు



నందలూరు: ముగ్గుల పోటీల్లో పాల్గొన్న తల్లులు



నందలూరు: తల్లిదండ్రులకు స్వాగతం పలుకుతున్న విద్యార్థులు

వీరబల్లి: పిల్లలకు మొదటి గురువులు తల్లిదండ్రులేనని వంగిమల్ల సర్పంచ్ సరస్వతమ్మ తెలిపారు. శనివారం ఉప్పరపల్లి పాఠశాలలో తల్లిదండ్రుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధితో పాటు పిల్లలకు క్రమశిక్షణతో కూడిన చదువు అవసరమన్నారు. అనంతరం తల్లిదండ్రులకు ఆటలు పోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు చంద్రశేఖర్, స్థానిక నాయకులు మధుసూదన్ రెడ్డి, జై చంద్రారెడ్డి, పద్మనాభ రెడి, చిన్నరెడ్డి, ఉపాధ్యాయులు తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సిద్దవటం (ఒంటిమిట్ట): విద్యార్థులు చెడు వ్యసనాలకు బానిసలు కాకుండా తల్లిదండ్రులు జాగ్రత్త వహించాలని ఇన్‌చార్జి తహసీల్దార్ మాధవీలత తెలిపారు. భాకరాపేట 11వ ఏపీఎస్పీ బెటాలియన్ పాఠశాలలో శనివారం తల్లిదండ్రుల సమావేశం జరిగింది. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, హెడ్‌కానిస్టేబుల్ కొండయ్య పాల్గొన్నారు.

తల్లిదండ్రుల ఆగ్రహం

మధ్యాహ్నం భోజనంలో నాణ్యత లోపించడంతో విద్యార్థుల తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం మండల పరిధిలోని 11 ఏపీఎస్పీ బెటాలియన్‌లోని జడ్పీహెచ్‌ఎస్‌లో తల్లిదండ్రుల సమావేశం నిర్వహించారు. సమావేశం అనంతరం విద్యార్థులకు వండి పెట్టిన మధ్యాహ్నం భోజనం మెనూలో నాణ్యత లోపాన్ని తల్లిదండ్రులు గమనించారు. ఈ విషయాన్ని పాఠశాల హెచ్‌ఎం నాగముని రెడ్డి దృష్టికి తీసుకెళ్లినా ఆయన వద్ద నుంచి ఎలాంటి సమాధానం రాకపోవడంతో విద్యార్థుల తల్లిదండ్రులు మండిపడ్డారు. దీంతో ఒక్కసారిగా తల్లిదండ్రులు వంట గదిని చుట్టుముట్టారు. నాణ్యత లోపంపై ఎంఈఓ విలియం రాజును వివరణ కోరగా మెనూ నాణ్యత లోపం ఉన్నట్లు తన దృష్టికి వచ్చిందని, సోమవారం విచారణ చేసి, తగు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ఆత్మీయ సమావేశం

రామాపురం: బి.రాచపల్లె గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో తల్లిదండ్రులతో ఉపాధ్యాయులు శనివారం ఆత్మీయ సమావేశాన్ని నిర్వహించారు.

రైల్వేకోడూరు మండలంలో..

రైల్వేకోడూరు అర్బన్: మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాల్లో ప్రధానోపాధ్యాయుల ఆధ్వర్యంలో శనివారం విద్యార్థుల తల్లిదండ్రులతో ఆత్మీయ సమావేశాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో ప్రధానోపాధ్యాయులు ఐజయ్య, నరశరాం రెడ్డి, సర్పంచ్ బుడుగు శివయ్య, సీహెచ్ రమేష్, మండల నాగేంద్ర, విద్యార్థులు పాల్గొన్నారు.

తుమ్మచెట్లపల్లి పాఠశాలలో సమావేశం

చిట్వేలి: తుమ్మచెట్లపల్లి ప్రాథమిక పాఠశాలలో శనివారం మెగా తల్లిదండ్రుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలకు ముగ్గులు పోటీలు నిర్వహించి బహుమతులు ప్రదానం చేశారు. అలాగే పిల్లలతో నృత్య ప్రదర్శన చేయించారు. గ్రామ సర్పంచ్ రామాంజులనాయుడు, పాఠశాల కమిటీ చైర్మన్ ప్రవీణ్ కుమార్, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

సంబేపల్లె మండలంలో..

సంబేపల్లె : మండలంలోని గుట్టపల్లె, ఎస్. సోమవరం, మోటకట్ల, పీఎస్‌కాలనీ, దుద్యాల, నాగిరెడ్డిగారిపల్లె, శెట్టిపల్లె, దేవపట్ల, సంబేపల్లె, గురిగింజకుంట, గున్నికుంట్ల, నారాయణరెడ్డిపల్లెలోని ప్రభుత్వ పాఠశాలలో శనివారం తల్లిదండ్రుల ఆత్మీయ సమావేశాన్ని ఆయా పాఠశాల ప్రధానోపాధ్యాయుల ఆధ్వర్యం నిర్వహించారు. అనంతరం ముగ్గుల పోటీలు నిర్వహించి గెలిచిన వారికి బహుమతులు అందజేశారు.

పాఠశాలల్లో పండుగ వాతావరణం

నందలూరు: రాష్ట్ర ప్రభుత్వం పాఠశాలల్లో శనివారం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల ఆత్మీయ సమ్మేళనాలు పూర్తిగా పండుగ వాతావరణంలో జరిగాయి. మండలంలోని నాగిరెడ్డిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, నల్లతిమ్మాయపల్లి హైస్కూల్, పాటూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో మామిడి తోరణాలు, అరటి పిలకలు, రంగురంగుల కాగితాలు, గాలి బుడగలతో సుందరంగా అలంకరించారు. ఆయా కార్యక్రమాల్లో మండల విద్యాశాఖాధికారులు నాగయ్య, అనంతకృష్ణ, పాటూరు సర్పంచ్ అక్కిరెడ్డి, స్వరూప రెడ్డి, అక్కిరెడ్డి మోహన్ రెడ్డి, నరసింహారెడ్డి పాల్గొన్నారు.

లక్కిరెడ్డిపల్లి: విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దే బాధ్యత తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల పైనే ఉంటుందని లక్కిరెడ్డిపల్లి ఎస్ఐ రవీంద్రబాబు పేర్కొన్నారు. మండలంలోని స్థానిక ఏపీ మోడల్ స్కూల్ పాఠశాలలో తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమావేశం నిర్వహించారు. మండల విద్యాశాఖాధికారి కె చక్రేనాయక్ మాట్లాడుతూ పిల్లలు సన్మార్గంలో పెంచడం గురువుల తరువాత తల్లిదండ్రల పాత్ర ముఖ్యమైందని తెలిపారు. ఎంపీడీఓ రెడ్డయ్య, ఇన్‌స్పెక్టర్ రవీంద్రబాబు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

సుండుపల్లెలో..

సుండుపల్లె: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థుల తల్లిదండ్రులతో ఆత్మీయ సమావేశాన్ని శనివారం పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జయన్న నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు ఉపాధ్యాయులను గౌరవించి మంచి విద్యను అభ్యసించి ఉన్నత స్థాయికి ఎదగాలన్నారు. ఈఓపీఆర్‌డీ నరేష్ బాబు, ఎంఈఓ ప్రవీణ్, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

జాగ్రత్తలు తీసుకోవాలి

గాలివీడు : పిల్లలపట్ల తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలని ఎంఈఓ-1 పిల్లి నాగరాజు పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల తల్లిదండ్రుల సమావేశాలను నిర్వహించారు. స్థానిక కేజీబీవీ పాఠశాలలో తల్లిదండ్రుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ విద్యార్థులు సెల్‌ఫోన్లు వాడడం వలన నష్టపోతున్నారని తెలిపారు. పిల్లలపై తల్లిదండ్రులు ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు.

బంగారు భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలి

నందలూరు: విద్యార్థులు ఉన్నత లక్ష్యాలతో ముందుకు సాగి వారి బంగారు భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని మండల విద్యాశాఖాధికారి నాగయ్య పేర్కొన్నారు. శనివారం ఆడపూరులోని అంబేద్కర్ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల అపూర్వ సమ్మేళనం ప్రిన్సిపాల్ హైమావతి ఆధ్వర్యంలో నిర్వహించారు.

ఒంటిమిట్టలో..

ఒంటిమిట్ట: మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో శనివారం తల్లిదండ్రుల సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థుల బాధ్యత ఉపాధ్యాయుల కంటే తల్లిదండ్రులపైనే ఎక్కువగా ఉంటుందని ఆయా పాఠశాల ఉపాధ్యాయులు తల్లిదండ్రులకు వివరించారు. ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, సిబ్బంది పాల్గొన్నారు.

పుల్లంపేట: మండల పరిధిలోని టి. కమ్మపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు వెంకటాద్రి నాయుడు, సుబ్బానాయుడు, ఎంవీ నారాయణ, ఉపాధ్యాయులు రమణారెడ్డి, సయ్యద్ సర్తాజ్ హుస్సేన్, బాల నరసింహులు, ఆసీఫ్ బాష, షామీర్, గిరిధర్, ప్రమీల పాల్గొన్నారు.

ఓబులవారిపల్లె: విద్యార్థులు పట్టుదలతో చదివి తల్లిదండ్రుల కలలు సాకారం చేయాలని ఎంపీడీఓ మల్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం మండల వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఎంపీడీఓ మల్‌రెడ్డి మాట్లాడుతూ తల్లిదండ్రులు, పిల్లల పట్ల శ్రద్ధ వహించాలని సూచించారు. ఎంఈఓ రెడ్డయ్య, రైల్వేకోడూరు రూరల్ సీఐ వేంకటేశ్వర్లు, ప్రాధానోపాధ్యాయుడు హరి, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాన్ని త్వరగా పూర్తి చేయాలి

గాలివీడు : మండలంలోని పక్కా ఇళ్ల నిర్మాణాన్ని లబ్ధిదారులు త్వరితగతిన పూర్తిచేయాలని హౌసింగ్ రమేష్ నాయక్ తెలిపారు. శనివారం మండల కేంద్రం లోని కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ గతంలో మండలానికి 2,371 గృహాలు మంజూరు అయ్యాయని, 481 అందులో 1,675 మంది లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేశారని తెలిపారు. గత ప్రభుత్వం మంజూరు చేసిన ఇళ్లను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. నిర్మాణాలు ప్రారంభించి మధ్యలో ఆపేసిన వారు తిరిగి ప్రారంభించి, పూర్తి చేసుకోవాలని కోరారు.

పారిశుద్ధ్య కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



మంత్రికి వినతిపత్రం అందజేస్తున్న కార్మికులు

రాయచోటి అర్బన్: పారిశుద్ధ్య కార్మికుల సమస్యలు పరిష్కరించాలని మంత్రి రాంప్రసాద్‌రెడ్డిని ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు నేలపాటి శ్రీనివాసులు కోరారు. శనివారం శ్రీనివాసులు ఆధ్వర్యంలో పారిశుద్ధ్య కార్మికులు మంత్రిని కలిశారు. ఈ సందర్భంగా కార్మికుల సమస్యలను పరిష్కరించాలని మంత్రికి వినతిప్రతం అందజేశారు. సీనియారిటీ ప్రకారం ఆప్కాస్ కార్మికులతో డ్రైవర్ పోస్టులను భర్తీ చేయాలని, కార్మికులకు సకాలంలో పనిముట్లు అందజేయాలని కోరారు. కార్యక్రమంలో కార్మికులు కేశవరావు, కృష్ణయ్య, వెంకటేష్, రవి తదితరులు పాల్గొన్నారు.

మహాసభలను జయప్రదం చేయండి

రైల్వేకోడూరు అర్బన్: మదనపల్లిలో ఈ నెల 21, 22 తేదీలలో జరిగే ఎస్ఎఫ్ఐ మహా సభలను జయప్రదం చేయాలని ఈ సంఘం జిల్లా కార్యదర్శి నరసింహ కోరారు. శనివారం స్థానిక జూనియర్ కాలేజీ ప్రాంగణంలో మహా సభలకు సంబంధించిన వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. నరసింహ మాట్లాడుతూ మదనపల్లిలో జరిగే మహాసభల్లో విద్యార్థుల సమస్యలపై కార్యాచరణ రూపొందిస్తామని తెలిపారు.

ఆకేపాటికి అడుగడుగునా బ్రహ్మరథం

ఓబులవారిపల్లె: వైఎస్సార్ సీపీ అన్నమయ్య జిల్లా అధ్యక్షులు, ఎమ్మెల్యే ఆకేపాటి అమర్నాథ్ రెడ్డి, 22వ తిరుమల మహాపాదయాత్ర శనివారం ఓబులవారిపల్లె మండలానికి చేరుకుంది. ఈ సందర్భంగా ఆయనకు అడుగడుగునా నాయకులు, ప్రజలు హారతులిస్తూ బ్రహ్మరథం పట్టారు. ఎమ్మెల్యే ఆకేపాటి మాట్లాడుతూ అన్నమ్మయ కాలిబాట అభివృద్ధి కోసం 22 సంవత్సరాలుగా వేలాది మంది భక్తులతో కాలిబాటన తిరుమలకు చేరుకొని కలియుగ దైవం వేంకటేశ్వరస్వామిని దర్శించుకుంటున్నామని తెలిపారు. కడప డిప్యూటీ మేయర్ బండి నిత్యానందరెడ్డి బృందం కడప నుంచి తిరుమల పాదయాత్రకు బయలుదేరి ఆకేపాటి అమర్నాథరెడ్డితో కలిసి తిరుమలకు వెళ్లారు. కొర్లకుంట అడ్డరోడ్డులో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షులు వత్తలూరు సాయికిషోర్ రెడ్డి, అక్కిరెడ్డి మధుసూదన్ రెడ్డి, ముక్కావారిపల్లి గ్రామంలో ముక్కా శ్రీకాంత్ రెడ్డి, ముక్కా వెంకటసుబ్బారెడ్డి, చెంగల్ రెడ్డి, మంగంపేట జాతీయ రహదారి వద్ద డీఆర్‌యూసీసీ మెంబర్ తల్లెం భరత్ కుమార్ రెడ్డి, చిన్నఓరంపాడు అడ్డరోడ్డులో చింతా సుదర్శన్ రెడ్డి గజమాలతో ఆకేపాటికి స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షులు వత్తలూరు సాయికిషోర్ రెడ్డి, డీఆర్‌యూసీసీ మెంబర్ తల్లెం భరత్ కుమార్ రెడ్డి, నాయకులు పంజం సుకుమార్ రెడ్డి, చెవ్వు శ్రీనివాసులు రెడ్డి, వైస్ ఎంపీపీ గూడురు గౌరీశంకర్ రాజు, సర్పంచ్‌లు జరుగునారాయణ రెడ్డి, పోలి పాపిరెడ్డి, బొమ్మవరం నారాయణ రెడ్డి, పామూరు రామిరెడ్డి పాల్గొన్నారు.

రాష్ట్రం సుభిక్షంగా ఉండాలి

పుల్లంపేట: రాష్ట్ర ప్రజలు సుభిక్షంగా ఉండేందుకు తిరుమలకు పాదయాత్ర చేపడుతున్నామని వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు, రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమర్నాథ రెడ్డి తెలిపారు. ఆకేపాటి అమర్నాథరెడ్డి 22వ తిరుమల పాదయాత్ర శనివారం పుల్లంపేట మండలం, అనంతయ్యగారిపల్లి, పుల్లంపేట, అనంతంపల్లి మీదుగా సాగింది. ఈ పాదయాత్రలో అమర్నాథ రెడ్డిని అనంతయ్యగారిపల్లి వద్ద కుమార్ రెడ్డి గజమాల వేసి సత్కరించారు. అనంతరం ఉడుమువారిపల్లి వద్ద తురకా శ్రీనివాసులు రెడ్డి, మలికార్జున రెడ్డి, వెంకటరెడ్డి, శంకర్ రెడ్డి గజమాలతో స్వాగతం పలికారు. అలాగే పుల్లంపేటలో ఎంపీపీ ముద్దా బాబుల్ రెడ్డి, సర్పంచ్ ఆకేపాటి శ్రీనివాసులు రెడ్డి, రామనాథం, సుదర్శన్ రెడ్డిలు అమర్నాథరెడ్డిని ఘనంగా సన్మానించారు. అప్పారాజుపేట వద్ద మండల కన్వీనర్ ముస్తాక్ శాలువాతో ఎమ్మెల్యేను సన్మానించారు. అనంతంపల్లి వద్దకు రాగానే ఎస్. హరినాథ్ రెడ్డి ఎమ్మెల్యేను గజమాలతో సత్కరించారు.



అమర్నాథ్ రెడ్డికి స్వాగతం పలుకుతున్న ముక్కా వెంకటసుబ్బారెడ్డి, ముక్కా శ్రీకాంత్ రెడ్డి, చందర్‌రెడ్డి తదితరులు



అమర్‌నాథ్‌రెడ్డికి సంఘీభావం తెలుపుతున్న ఎమ్మెల్సీ రమేష్ యాదవ్, వైఎస్సార్‌సీపీ నాయకులు

ఆకేపాటి పాదయాత్రకు సంఘీభావం

రాజంపేట టౌన్: ఎమ్మెల్యే ఆకేపాటి అమర్నాథరెడ్డి చేపట్టిన తిరుమల మహాపాదయాత్రకు మున్సిపల్ చైర్మన్ పోలా శ్రీనివాస్‌రెడ్డి శనివారం సంఘీభావం తెలిపారు. ప్రజల కోసం ప్రతి ఏటా ఆకేపాటి పాదయాత్ర చేపడుతున్నారని తెలిపారు. పాదయాత్రకు ఎలాంటి ఆలంకం కలగకుండా సాఫీగా సాగాలని శ్రీనివాస్‌రెడ్డి ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కాకతీయ విద్యా సంస్థల అధినేత పోలా వెంకటరమణారెడ్డి, ఆవుల చెంగల్‌రెడ్డి, పార్థసారథి తదితరులు పాల్గొన్నారు.

ఎంపీపీ మేడా సంఘీభావం

నందలూరు: రాజంపేట శాసనసభ్యులు ఆకేపాటి అమర్నాథరెడ్డి మహాపాదయాత్రకు ఎంపీపీ మేడా విజయభాస్కర్ రెడ్డి సంఘీభావం తెలిపి ఘనంగా సత్కరించారు. శనివారం రెడ్డిపల్లి చెరువు వద్ద వెలసిన అంజనేయస్వామి ఆలయం వద్ద ఆకేపాటిని మేడా కలిశారు. సోమిశెట్టి ప్రభాకర్, నడివీధి సుధాకర్, తుమ్మల శ్రీధర్ గౌడ్, పెనగలూరు నాగసుబ్బయ్య, ఓర్సు శ్రీనివాసులు ఉన్నారు.

రామాపురం: రాజంపేట ఎమ్మెల్యే, అన్నమయ్య జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు ఆకేపాటి అమర్నాథ్ రెడ్డి చేపట్టిన మహాపాదయాత్రకు ఎమ్మెల్సీ రమేష్ యాదవ్, జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ బాలయ్య, జెడ్పీటీసీ వెంకటరమణ, వల్లూరు జెడ్పీటీసీ వెంకటసుబ్బయ్య, కమలాపురం జెడ్పీటీసీ సుమిత్ర, చెన్నూరు మండల అధ్యక్షుడు చీరల సురేష్ యాదవ్ సంఘీభావం తెలిపారు.

రైల్వేకోడూరు అర్బన్: రాజంపేట ఎమ్మెల్యేఆకేపాటి అమర్నాథ్ రెడ్డి పాదయాత్రకు రైల్వేకోడూరు, అనంతరాజుపేట వద్ద వైస్ ఎంపీపీ రామిరెడ్డి ధ్వజారెడ్డి, పంజం సుకుమార్ రెడ్డి ఆధ్వర్యంలో శనివారం ఘనస్వాగతం పలికారు. జెడ్పీటీసీ రత్నమ్మ, సీహెచ్ రమేష్, మండల నాగేంద్ర, వేణుగోపాల్ రెడ్డి, బండారు మల్లికార్జున, రాజ, శంకర తదితరులు పాల్గొన్నారు.

విభిన్న ప్రతిభావంతుల సంక్షేమానికి కృషి

రాయచోటి అర్బన్: రాష్ట్రంలో విభిన్న ప్రతిభావంతుల సంక్షేమానికి కృషి చేస్తున్నామని రాష్ట్ర యువజన, క్రీడ, రవాణాశాఖ మంత్రి మండిపల్లె రాంప్రసాద్‌రెడ్డి అన్నారు. సోమవారం పట్టణంలోని మార్కెట్‌యార్డులో ఏపీ దివ్యాంగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ప్రపంచ 65వ దివ్యాంగుల వారోత్సవాలు జరిగాయి. ఆయన మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేని విధంగా విభిన్న ప్రతిభావంతులకు ట్రై సైకిల్స్, కృత్రిమ పరికరాలు పంపిణీ చేస్తున్నామని తెలిపారు. ఏపీ దివ్యాంగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రంగారెడ్డి, సీపీఐ జిల్లా కార్యదర్శి నరసింహులు పాల్గొన్నారు.